జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

దీపావళి శుభాకాంక్షలు

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 20-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 488 పేజీలు: 4 వెల : రూ.7


## నేడు దివ్వెల పండుగ




* భారతీయ సంస్కృతికి ప్రతిబింబం.. దీపావళి * దీపాల పండగకు సిద్ధమవుతున్న జిల్లావాసులు



**శ్రీకాకుళం, అక్టోబరు 19 (వార్త):** భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా చేసుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా చెప్పుకునే దీపావళి పండుగను చేసుకునేందుకు జిల్లావాసులు సోమవారం సంసిద్ధులవుతున్నారు. దీపావళి సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు జిల్లావాసులు తరలిరావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి. అలాగే బాణసంచా విక్రయించే షాపులకు ప్రజలు బారులు దీరారు.

### జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు: మంత్రి అచ్చెన్న


జిల్లా ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లాప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అంధకారంపై వెలుగు విజయం సాధించిన దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు.


పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు

\- జాతీయ వార్త మేనేజ్‌మెంట్


## సంప్రదాయబద్ధంగా నరకాసుర వధ



**అరసవల్లి, అక్టోబరు19 (వార్త):** నరక చతుర్దశి మహోత్సవం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా నరకాసుర వధ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత ఉషా పద్మిని ఛాయా సమేత సూర్యనారాయణ స్వామివారి తిరువీధి మహోత్సవం జరిగింది. స్వామివారి ఉద్యాన వనంలో గణపతి పూజతో ప్రారంభమై, లక్ష్మీ నారాయణులకు పురుష సూక్త విధానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లోకక్షేమం, శాంతి, సమృద్ధి, సకల జనుల మంగళకాంక్షలతో నరకాసుర వధ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



## 24న పాతపట్నంలో మెగా జాబ్ మేళా

* 11 కంపెనీల్లో 500 ఉద్యోగాలు * నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, అక్టోబరు 19(వార్త):** నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో డాక్టర్ రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా మోటార్స్‌తో సహా మొత్తం 11ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయి. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులు. దాదాపు 500కు పైగా ఖాళీలను భర్తీ చేయనున్న ఈ నియామకాల ద్వారా ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, శ్రీ సిటీ (నెల్లూరు), హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఉదయం తొమ్మిది గంటలకు మేళా ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8317652552 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## శ్రీకూర్మ క్షేత్రానికి.. మహర్దశ



4లో

* ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తా * సంప్రదాయాలకు భంగం కలుగకుండా ఆలయాభివృద్ధి చేస్తాం * ఆలయాభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు * మరికొద్ది రోజుల్లో కొత్త శ్రీకూర్మం క్షేత్రాన్ని చూస్తారు * కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

## 21 నుండి 31 వరకూ పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు

* ఘనంగా నిర్వహించేందుకు సంసిద్ధమైన జిల్లా పోలీసు శాఖ * అమర పోలీసుల సేవలను స్మరించుకుందాం * పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు * జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి

3లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ముఖలింగేశ్వర స్వామి సన్నిధిలో డీఆర్వో దంపతులు

**జలుమూరు, అక్టోబరు19(వార్త):** శ్రీముఖలింగేశ్వర క్షేత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు సతీసమేతంగా సందర్శించారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. ఆలయ శిలా సంపద, శిల్పకళను పరిశీలించిన డిఆర్ఓ ఆశ్చర్యానికి గురయ్యారు. ఆ తరువాత వారాహి సమేత శ్రీముఖలింగేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ అర్చకులు అందజేశారు. డీఆర్వో వెంట రెవెన్యూ సిబ్బంది, అర్చకులు బి. సుబ్బారావు, నారాయణమూర్తి శివ, శ్రీముఖలింగం గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుంట కర్ణ వీరుడు తదితరులు పాల్గొన్నారు.



# శిథిలావస్థలో తాగునీటి ట్యాంకులు

*** మరమ్మతులకు నోచుకోని రక్షిత నీటి పథకాలు * పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**

**సోంపేట, అక్టోబరు 19 (వార్త):** మండలంలోని ఉద్దానం తీరప్రాంత గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని లక్ష్యంతో దశాబ్దాలకు క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండడంతో అటువైపు వెళ్లేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసినప్పటికీ ఎకువూరు, ఎర్రముక్కాం, ఇసుకల పాలెం, రామయ్య పట్నం, గొల్లగండి, బాతుపురం, మాకన్నపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులు చాలా కాలంగా మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా మారాయిని ఆయా గ్రామా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాటర్ ట్యాంకు పైకి ఎక్కేందుకు



ఏర్పాటు చేసిన మెట్లు శిథిలమై పిల్లర్లు పెచ్చులూడటంతో పైకి వెళ్లి ట్యాంకులు శుభ్రం చేయడానికి ఎటువంటి అవకాశాలు లేక అదే నీటిని సరఫరా చేస్తున్నారని ఆయా గ్రామాల చెందిన మహిళలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా స్వచ్ఛమైన




తాగునీరు అందిస్తున్నారని ఆ నీటిని తాగేందుకు వంటకు వాడాలని ఇటీవల కొన్ని గ్రామాల్లో దండోరా కూడా వేయించారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకుండా స్వచ్ఛమైన నీరు ఎలా అవుతుందని పలువురు మహిళలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సత్వరమే స్పందించి ట్యాంకులు కూలిపోక ముందే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై రూరల్ వాటర్ సప్లై విభాగం జెఇ విష్ణుమూర్తిని సంప్రదించగా పంచాయతీ కార్యదర్శులు స్పందించాలని శిథిలావస్థకు చేరిన ట్యాంకులు రెండు నెలల్లో మరమ్మతులు చేసేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామన్నారు.



## ఘనంగా మహాలింగార్చన

**అరసవల్లి, అక్టోబరు 19 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామికి ఆదివారం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాగా, సూర్యనారాయణస్వామికి ఒక కేజీ 888 గ్రాముల మూడు వెండి బిందెలను ఫిరంగిపురం, బూర్జ వాస్తవ్యులు కేశవ రావు, ఉమా మహేశ్వర రావు, మంత్రి వెంకట స్వామి ఆధ్వర్యంలో అందజేశారు. వీటిని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మకు అందించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. టికెట్లు రూపేనా రూ.79,500, పూజలు, విరాళాల రూపంలో రూ.1,23,446, ప్రసాదాల రూపంలో రూ.1,38,275లు ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.



## జాగ్రత్తలతోనే వ్యాధులకు అడ్డుకట్ట

*** ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్**



**సోంపేట, అక్టోబరు 19(వార్త):** ప్రస్తుత సీజన్లో వర్షాలు తరచుగా కురవడం... ఇండ్లు, నివాస స్థలాల పరిసరాలలో వర్షపు నీరు నిల్వ ఉండడం, చెత్తాచెదారాలు పడి ఉండడం మొదలైన కారణాల వల్ల వివిధ రకాలైన జబ్బులు ప్రజలను చుట్టుముడుతున్నాయి. ఎక్కడ చూసినా వివిధ రకాల జ్వరాలు, అతిసారం, పచ్చకామెర్లు మొదలైన సీజనల్ వ్యాధులతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. వీటిని నయం చేసుకోవడానికి తరచూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా శారీరకంగా మానసికంగా కృంగిపోవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి సోంపేటకు చెందిన ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్ రాజేంద్రప్రసాద్ వార్త ప్రతినిధితో ఆదివారం పలు విషయాలను వెల్లడించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యానికి గురవడం సాధారణమన్నారు. నివసిస్తున్న పరిసరాలు చుట్టూ చెత్తాచెదారాలు పేరుకుపోవడం... వర్షపు నీరు నిల్వ ఉండి మురికిగా మారడం... దోమలు అధికంగా ఉత్పత్తి కావడం... మొదలైన సమస్యలు సీజనల్ వ్యాధులకు మూల కారణమని అన్నారు. ఈ పరిస్థితుల వల్ల వ్యక్తులు తరచుగా అతిసారం, మలేరియా, టైఫాయిడ్, పచ్చకామెర్లు మొదలైన వ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగే నీరు తినే ఆహారం వంటి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తరచుగా వేడి నీరు తాగాలన్నారు. అలాగే వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మూత పెట్టి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినడం శ్రేయస్కరం కాదని పేర్కొన్నారు. అలాగే మరిగించిన పాలు తాగడం చాలా మంచిదని అన్నారు. పాలు బాగా మరిగించాలని సూచించారు. ప్రస్తుత సీజన్లో మాంసాహారానికి దూరంగా ఉండడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి జాగ్రత్తలు పాటించని యెడల కలరా కూడా వచ్చే ప్రమాదం ఉందని అన్నారు మురికి నీరు నిల్వ వలన దోమలు విజృంభించి మనుషులపై దాడి చేస్తాయని వీటి భారీ నుంచి తప్పించుకునేందుకు తప్పనిసరిగా దోమతెరలు వాడడం మంచిదని అన్నారు. అలాగే దుమ్ము దూలికి దూరంగా ఉండాలని సూచించారు. దుమ్ము ధూళి పీల్చడం వలన శ్వాస కోస వ్యవస్థ దెబ్బతింటుందని దీనివలన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని డాక్టర్ రాజేంద్రప్రసాద్ వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి ఎల్లవేళలా ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండడం చాలా మంచిదన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

**పోలాకి/జలుమూరు, అక్టోబరు19(వార్త):** పేదల సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పార్టీ ఎప్పుడూ గళం విప్పుతుందని శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఆదివారం పోలాకి మండలం మబగాం గ్రామంలో నిర్వహించిన 'రచ్చబండ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మబగాం, వనితమండలం, తలసముద్రం క్లస్టర్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పేద విద్యార్థులు కూడా ఉన్నత విద్య, వైద్యం పొందాలనే దృష్టితో కొత్త మెడికల్ కళాశాలలను స్థాపించారన్నారు. ఆ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, సంక్షేమ పథకాల రద్దుపై ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్ర స్థాయి నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కరిమి



రాజేశ్వరరావు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, బీసీ సెల్ అధ్యక్షులు డోల సాయి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు, బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమా మహేశ్వరరావు, ఇతర నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీలు, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## గంగాధర్ కుటుంబానికి ఇప్పిలి పరామర్శ

**సోంపేట, అక్టోబరు 19(వార్త):** సోంపేట బీల ఉద్యమకారుడు గంగాధర్ పట్నా యక్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ జడ్పిటిసి సీనియర్ వైసీపీ నేత కంచిలికి చెందిన ఇప్పిలి కృష్ణారావు ఆదివారం పరామర్శించారు. గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా జరిగిన నాటి బీల పోరాటంలో గంగాధర్ పాత్రను గుర్తు చేసుకున్నారు. పరామర్శించిన వారిలో వైసీపీ నేతలు వీరాస్వామి, గణపతి, రావాడ సతీష్ ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు వైసీపీ నేతల సంతాపం



**సోంపేట, అక్టోబరు 19(వార్త):** కంచిలి మండలం మఠం సరియాపల్లి గ్రామంలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన ఇద్దరు వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలను కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నేతలు కలిసి ఆదివారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గ్రామానికి చెందిన బుడ్డపు పురుషోత్తం రెడ్డి (52) కొద్ది రోజుల క్రితం రక్త పోటుకు గురై మరణించారు. అలాగే 29 ఏళ్ల యువకుడు ముఖేష్ జెన్నీ గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచారు. ఈ రెండు కుటుంబాలను ఆదివారం పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ కొనపల సురేష్, లడ్డు కేశవ పాత్ర, బుడ్డపు విశ్వనాథం, రంగాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బాణాసంచా షాపు తనిఖీ



**మెళియాపుట్టి, అక్టోబరు 19(వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ కేంద్రాన్ని టెక్కలి ఆర్డీవో టి.కృష్ణమూర్తి, డీఎస్పీ డి.లక్ష్మణరావులు సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు చేపట్టాలని సూచించారు. వారి వెంట తహశీల్దారు పాపారావు, డిప్యూటీ తహశీల్దార్ రాము, సీనియర్ సహాయకులు జగన్మోహన్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, బాణాసంచ విక్రయదారులు ఉన్నారు.

## బాలి యాత్ర దీక్షలు ప్రారంభం



**జలుమూరు, అక్టోబరు19(వార్త):** శ్రీముఖలింగం దివ్య క్షేత్రంలో ఆదివారం బాలి యాత్ర దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్ష 21 రోజులు ఉంటుంది. శ్రీముఖలింగేశ్వర స్వామి సన్నిధిలో జరిగే బాలియాత్ర దీక్ష విరమణ వచ్చే నెల 9న ఉంటుంది. 21 మంది మాలాధారణ చేసి నియమ నిష్టలతో దీక్షలు చేసేందుకు సిద్ధమయ్యారు. గతేడాది కంటే ఈ యాడాది స్థానిక మధుకేశ్వరాలయంలో కార్తీకమాసం ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు భక్తులు వెల్లడించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక రద్దు

**శ్రీకాకుళం, అక్టోబరు19 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమం దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 20న రద్దు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి మారెళ్ళ వెంకటేశ్వర్రావు ఆదివారం తెలియజేశారు.

దీపావళి శుభాకాంక్షలు
జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

* ఘనంగా నిర్వహించేందుకు సంసిద్ధమైన జిల్లా పోలీసు శాఖ * అమర పోలీసుల సేవలను స్మరించుకుందాం * పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి





# అమరుల త్యాగం.. మరువం

**సంఘ వ్యతిరేక శక్తులపై పోరాడుతూ జిల్లాకు చెందిన అయిదుగురు పోలీసులు విధి నిర్వహణలోనే అమరులయ్యారు. వేర్వేరు ఘటనల్లో వారు అసువులు బాశారు. వారి త్యాగాలు అమూల్యం. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.**



పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన ఎం.వెంకట రమణ 1976లో ఏప్రిల్ 15న జన్మించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన 1998 సెప్టెంబరు ఒకటో తేదీన కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. స్పెషల్ పార్టీలో కీలకంగా వ్యవహరించేవారు. నులకజోడు గ్రామంలో అర్ధరాత్రి వేళ సుమారు 200 మంది మావోయిస్టులు రైస్ మిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లి పోయారు. కూంబింగ్ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ విరుచుకుపడటంతో 2001 అక్టోబర్ 27న నడిమిగూడ వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేల్చడంతో వెంకటరమణ మరణించారు.



పలాస మండలం నీలిభద్రలో ఓ వ్యక్తిని హతమార్చి ఆస్తిని దోచుకునేందుకు దుండగులు ప్రణాళిక వేశారు. దానిపై సమాచారం రావడంతో పోలీసులు ఆయన ఇంటి వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. దానికి ఇన్‌ఛార్జిగా హెడ్ కానిస్టేబుల్ అన్నెపు పాపారావు నియమించారు. 1997లో జూలై 17న అర్ధరాత్రి వేళ ఆయన విధుల్లో ఉన్న సమయంలో స్థానికంగా ఓ ఇంటిపై నక్సల్స్ దాడి చేశారు. వారిపై ఎదురుదాడికి దిగిన పాపారావు తూటాలకు నేటలకొరిగారు.

## 21 నుంచి 31 వరకూ.. పోలీసు..

# అమరవీరుల స్మారకోత్సవాలు

**శ్రీకాకుళం,అక్టోబరు19(వార్త):** పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతీ ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు మంగళవారం నుంచి అట్టహాసంగా ప్రారంభంకానున్నాయని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను, త్యాగాలను కొనియాడుతూ ఈ స్మారకోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమయ్యింది. ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఈ స్మారకోత్సవాలు నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులను గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల కీలకమైన పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశంగా ఈ స్మారకోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు. ఈ నెల 21 ఉదయం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినం ఘనంగా నిర్వహించనున్నారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, తదితర అసాంఘిక శక్తులతో పోరాటమే గాక విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన జంక్షన్లు, పబ్లిక్ ప్రదేశాల్లో అమర వీరులను స్మరిస్తూ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. 21 తేదీన జిల్లా కేంద్రంగా ఎస్పీ కార్యాలయం లోను అదేవిధంగా అక్టోబరు 22 నుంచి 31 తేదీలలో ఎచ్చెర్ల లోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీసులు ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన చేయనున్నారు. అలాగే సబ్ డివిజన్/సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ ల స్థాయిలో కూడా ఓపెన్ హౌస్ నిర్వహణ జరుగుతుంది. ఈనెల 22 నుంచి 30 తేదీల్లో జిల్లాలోని పోలీసు అమర



వీరుల గ్రామాలను పోలీసులు సందర్శించనున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అమరులైన పోలీస్ సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ జ్ఞాపికలను అందజేస్తారు. అమర వీరుల సేవలను వివరించడం. డిఎస్పీ స్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమర వీరుల గ్రామాలు/పట్టణాలు సందర్శించనున్నారు. వారు చదివిన పాఠశాలలు/కళాశాలకు వెళ్లి అమరుల ఫోటోలు పెట్టి నివాళులు అర్పించేలా సూచించడం... అమర వీరుల గ్రామంలో ఏదైనా పాఠశాల లేదా రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలు ఇవ్వడం, పోలీసు అమర వీరుల చేసిన గొప్ప పనుల వివరించి వారి ఫోటోలకు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించి.. వారి సేవలను కొనియాడనున్నారు. ఈనెల 24 నుంచి 27తేదీల మధ్య రోజులలో జిల్లాలోని, అన్ని సబ్ డివిజన్‌ల పరిధిలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు/ కళాశాలల్లోని విద్యార్థులకు చర్చా వేదికలు, వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు పోలీసు అధికారులు నిర్వహిస్తారు. జిల్లాలోని మూడు సబ్ డివిజన్‌లలో దేశభక్తిని తెలిపే ఓపెన్ థియేటర్‌లలో సమాజ భద్రత కోసం అసాంఘిక శక్తులను అణచివేస్తూ త్యాగం, పరాక్రమాలు కనపరిచే పోలీసు దేశభక్తిని తెలిపే సందేశాత్మకమైన చిత్రాలను జిల్లా వ్యాప్తంగా ప్రదర్శింపనున్నారు. ఈనెల 28 నుంచి 30 తేది మధ్య రోజులలో పోలీసు బ్యాండ్ షోలు, పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు నిర్వహించ నున్నారు. పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే పాటలు ఆలపించనున్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీసు విభాగంలో స్పోర్ట్స్, మారథాన్, సంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. అలాగే జిల్లాలోని బ్లడ్ డొనేషన్ క్యాంప్ లను అన్ని సబ్- డివిజన్లలో పోలీసుల కుటుంబాలకు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తారు 28వ తారీఖున శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తారు. 29వ తేదీన ప్రముఖులు, డీఎస్పీలు, సీఐలు పోలీసుల త్యాగాలపై ప్రముఖ వ్యక్తుల ద్వారా సెమినార్/ఉపన్యాసాలను నిర్వహించనున్నారు. 30 తేదీన పోలీసు అమర వీరుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానం చేయడం, వారి సేవలను ప్రశంసించనున్నారు. 31వ తేదీన జిల్లా కేంద్రంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఉదయం యూనిట్ రన్, సాయంత్రం కొవ్వొత్తులను ప్రదర్శిస్తు ర్యాలీ నిర్వహించనున్నారు. ఇవే గాక పోలీసు అమర వీరుల త్యాగాలను గురించి తెలియచేస్తూ స్థానిక వార్తాపత్రిక ఎడిషన్లలో వారి చిత్రాలను ప్రచురించడం జరుగుతుంది. ఈ నెల 31వ తేదీన పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు ముగియనున్నాయి.



సంతకవిటి మండలం వాల్తేరుకు చెందిన పి.కృష్ణమూర్తి 1993లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. నక్సల్స్ ఏరివేతలో చురుకైన పాత్ర పోషించేవారు. నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన కృష్ణమూర్తి 2005 జూన్ 5న మందస మండలం హరిపురం కూడలిలో నక్సల్స్ వెనుక నుంచి దాడి చేసి కాల్చి చంపారు.



కాశీబుగ్గకు చెందిన నరేంద్రదాస్ నక్సల్స్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి పోలీసు అధికారులకు ఇచ్చేవారు. వారి ఉద్యమాలను నీరు గార్చేందుకు కృషి చేసేవారు. వారి కదలికలను గుర్తించి ఎప్పటికప్పుడు నిరోధించడంలో తోడ్పడేవారు. ఈ క్రమంలో ఆయన అడ్డు తొలగించుకోవాలని నక్సల్స్ భావించారు. 1997 మార్చి 17న కాశీబుగ్గలో దైవదర్శనానికి వెళ్లిన దాసును రివాల్వర్‌తో కాల్చి చంపారు.

విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన ఎస్సై బంగారునాయుడు 1992లో నక్సల్స్ ఘాతుకానికి బలయ్యారు. ఆయన బారువ, కాశీబుగ్గ ఠాణాల్లో పని చేశారు. మందస మండలం రట్టి, భేతాళపురం గ్రామాల మధ్య ఉన్న కొండల్లో నక్సల్స్ ఉన్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకునేందుకు సిబ్బందితో కలిసి బంగారునాయుడు వెళ్లారు మార్చి 23న ఉద్దానం దళానికి చెందిన నక్సల్స్ జరిపిన కాల్పుల్లో అసువులు బాశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు 19(వార్త):** విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండే విద్యలో రాణించగలిగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఆదివారం నరసన్నపేట ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా మండల స్థాయి సభ్యులు పాల్గొన్నారు.



# శ్రీ కూర్మ క్షేత్రానికి మహర్దశ

*** ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తా**
*** సంప్రదాయాలకు భంగం కలుగకుండా ఆలయాభివృద్ధి చేస్తాం**
*** ఆలయాభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు**
*** మరికొద్ది రోజుల్లో కొత్త శ్రీకూర్మం క్షేత్రాన్ని చూస్తారు**
*** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం, అక్టోబరు19 (వార్త):** ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మం ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి శ్రీకూర్మనాథుని దర్శించుకుని పూజలు చేశారు. కేంద్ర మంత్రిని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ మధ్య స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. పురాణ ప్రాశస్త్యతను తెలుసుకున్నారు. ఇంద్రపుష్కరిణి పరిసర ప్రాంతాలను ఎలా వృద్ధి చేయొచ్చో క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ శ్రీ కూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలోనే పూజలు జరిగే 7వ శతాబ్దానికి చెందిన ఏకైక పురాతన కూర్మనాథ ఆలయాన్ని మరింత వృద్ధి చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం బోర్డు మెంబర్లు, స్థానికులు, జిల్లా అధికారులతో కలసి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఆలయ గోడలు, స్తంభాలు, కొన్ని చోట్ల విగ్రహాలను జీర్ణోద్ధారణ చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆలయ ప్రాశస్త్యత తెలిసిన నిపుణులతో పనులను చేయాల్సివుందని తెలిపారు. ఆలయ విశిష్టతను మరో మెట్టు ఎక్కించేలా.. సంప్రదాయాలకు భంగం కలుగకుండా వ్యవహారాన్ని చేపట్టాలన్నారు. ఆలయ పునరుద్ధరణతో పాటు, నిత్యాన్నదానం, అభివృద్ధి, పిండ ప్రధానం కోసం కొత్త భవనం, పుష్కరిణి ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఇందుకోసం ఇండిగో సంస్థ సి.ఎస్.ఆర్ నిధుల నుండి పది కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. శ్రీకూర్మ క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి అవకాశం ఉందని.. ఆలయంలో అభివృద్ధి లేదని బాధపడేవారు మరికొద్ది రోజుల్లో కొత్త శ్రీకూర్మంను చూస్తారని స్పష్టం చేశారు. శ్రీకాకుళం పరిసర ఆలయాలలో టూరిజంను అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోడ్పాటుతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం, దేశం అభివృద్ధి వైపు పయనిస్తోందని, డబుల్ ఇంజన్ సర్కారు.. డబుల్ స్పీడ్‌తో వెళ్తుందని తెలిపారు. ప్రధాని మోదీ పాలనలో ఈ పదహారు నెలలు మరింత ప్రత్యేకమైనదని.. అభివృద్ధి విషయంలో రాష్ట్రం ఒక అడుగు వేస్తే కేంద్రం రెండు అడుగుల సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. ఆలయ ధర్మకర్తగా ఉన్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఇప్పటికే శ్రీకూర్మం క్షేత్రం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.






## కులం, వర్గం రద్దు చేసినపుడే సమాజ అభివృద్ధి

**పలాస,అక్టోబరు19(వార్త):** కులం, వర్గం రద్దు చేసినపుడే సమాజ అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఎస్సీ, ఎస్టి రైల్వే యూనియన్ ఆఫీసులో మామిడి కోదండరావుచే రచింపబడిన వర్తమానం నుండి గతం వైపు....అనే పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఎంఎన్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పిట్ట గీతా రాణి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తూ పౌరహక్కుల సంఘం అధ్యక్షులు పత్తిరి దానేష్ మాట్లాడుతూ ప్రజా సంఘాలన్నీ ఐక్యమత్యంగా మనువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని అభివృద్ధిని అడ్డుకొని బ్రాహ్మణాధిక్య సమాజ నిర్మాణం కోసం బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. మనువాదాన్ని ఓడించకపోతే భవిష్యత్తు లేదని రచయిత మామిడి కోదండ రావు చేసిన విశ్లేషణ నేటి సమాజానికి అద్దం పడుతోందన్నారు. విద్యార్థులు, యువజనులు ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చ దుర్యోధన, సాలిన వీరాస్వామి, కోర్నాన ఉమాపతి, తెప్ప పాపారావు, పిట్ట జోగారావు, పిలక కృష్ణారావు, తుంగాన శంకరరావు, మట్ట జీవన్ బాబు, మామిడి గణపతి, నగిరి కరుణాకర్, బోకర దుర్యోధన, నాగమణి, వై.భార్గవ్ పాల్గొన్నారు.

## పంచలోహ విగ్రహాల చోరీ

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు19 (వార్త):** నరసన్నపేట ఇందిరా నగర్‌లోని సిద్ధాశ్రమంలో శనివారం దొంగతనం జరిగినట్లు సిసి ఫుటేజ్ రికార్డుల్లో బయటపడింది. ఒక యువకుడు మూడు పంచలోహాల విగ్రహాలని, ఇత్తడి పూజా సామాగ్రిని ఒక గోని సంచిలో వేసుకొని పట్టుకుపోతున్న దృశ్యాలు సిసి ఫుటేజ్ లో కనిపించాయి. ఈ మేరకు సిద్ధాశ్రమ నిర్వాహకులు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసన్నపేట ఎస్సై శంకర్రావు సంఘటనా స్థలాన్ని శనివారం సాయంత్రం పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును తెలుసుకొని సిద్ధాశ్రమ నిర్వాహకుల నుండి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముత్యాలమ్మ కోనేరు పార్క్ వద్ద అన్న ప్రసాద వితరణ



**పలాస, అక్టోబరు 19 (వార్త):** ముత్యాలమ్మ కోనేరు పార్క్ వద్ద ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద పలాస కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. లయన్ కొర్రాయి బాలకృష్ణ యాదవ్ ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింద్రీ మధుసూదన్ రావు, సెక్రెటరీ తమ్మినేని మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, మాజీ ప్రెసిడెంట్ హనుమంతు ఎండు దొర, బమ్మిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సత్యసాయిబాబా శతవర్ష జయతి వేడుకలు



**పలాస, అక్టోబరు 19 (వార్త):** భగవాన్ సత్యసాయిబాబావారి శతవర్ష జయంతి వేడుకలలో భాగంగా ఆదివారం పలాస శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో కేటీ రోడ్డులో మల్లా రామేశ్వరరావు ఇంటి వద్ద గృహ నామసంకీర్తన ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక రద్దు

**శ్రీకాకుళం, అక్టోబరు19(వార్త):** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమము దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## కోటబొమ్మాళి పీఏసీఎస్ డైరెక్టర్‌గా సకలభక్తుల



**కోటబొమ్మాళి, అక్టోబరు 19 (వార్త):** తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్త సకల భక్తుల రామ్ కుమార్‌కు కోటబొమ్మాళి పీఏసీఎస్ డైరెక్టర్‌గా నియమించారు. కళింగ కోమటి సామాజిక వర్గానికి చెందిన సకల భక్తుల రామ్ కుమార్ తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. గతంలో ఆయన సతీమణి కోటబొమ్మాళి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా వ్యవహరించారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పీఠాన్ని సకల భక్తుల రామ్ కుమార్ ఆశించినప్పటికీ, కొన్ని రాజకీయ సమీకరణలో భాగంగా వెంట్రుకవాసిలో ఆ పీఠం దక్కించుకోలేకపోయారు. టిడిపిలో సీనియర్లు ఆయనపై సానుభూతి చూపిస్తూ.. అధిష్టానం దృష్టికి సకల భక్తుల రామ్ కుమార్ పార్టీకి చేసిన సేవలను గుర్తించాలంటూ కొందరు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో అధిష్టానం ఆయనకు కోటబొమ్మాళి పిఎసిఎస్ డైరెక్టర్‌గా నియమించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలం పాటు చేసిన సేవలను గుర్తించి తనకు డైరెక్టర్ పదవి ఇచ్చినందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, టిడిపి కోటబొమ్మాళి మండల శాఖ అధ్యక్షులు బోయిన రమేష్, కళింగ కోమటి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, ఇతర గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రామ్ కుమార్ పేర్కొన్నారు. పిఎసిఎస్ డైరెక్టర్‌గా రామ్ కుమార్ ను నియమించడం పట్ల కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కోరాడ గోవిందరావు, టిడిపి సీనియర్ నేతలు కృష్ణ స్వామి, మజ్జి కృష్ణారావు, సకల భక్తుల వైకుంఠరావు, కోరాడ గోవింద్, లాడి దాలప్పన్న, తలాసు కృష్ణారావు, చిన్ననాటి స్నేహితులు డబ్బీరు నరసింగరావు, సకల భక్తుల శ్రీనివాస్, శిరసాన శ్రీనివాస్, నౌగాపు నాగరాజు, తలగాపు వెంకటరమణ, మంచాల వెంకటరమణ, బోయిన శ్రీనివాస్, నౌపడా కామేశ్వరరావు, తుల రాజారావు, బోయిన శివకుమార్, చంద్రకళ, రఘుపాత్రుని రామారావు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## పెట్రోల్ బంకుకు ప్రతిపాదనలు పంపించండి

**మెళియాపుట్టి,అక్టోబరు 19(వార్త):** పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని తహశీల్దార్ పాపారావుకు టెక్కలి ఆర్డీవో టి.కృష్ణమూర్తి ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోనున్న శిథిలావస్థకు చేరిన పాత తహశీల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.





## పేలుతున్న బాణసంచా ధరలు

***షాపులు వద్ద భద్రత డొల్ల *పట్టించుకోని పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు**

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు19(వార్త):** నరసన్నపేట పట్టణంలో దీపావళి సందర్భంగా టపాసుల ధరలు పేలుతున్నాయి. ఆయా షాపుల నిర్వాహకులు అధిక ధరలకు బాణసంచాను విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. జనావాసాల మధ్య మందుగుండు సామగ్రిని విక్రయిస్తున్నారు. ఆయా షాపుల వద్ద ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోవడం లేదు. ఏదేనా ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు హడావుడి చేస్తుంటారని, అదే ముందస్తు చర్యలు చేపడితే ప్రమాదాలు అడ్డుకట్ట వేయవచ్చని ప్రజలు చెబుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546